
sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 24-10-2026 శనివారం | సంపుటి-02 సంచిక : 178 EDITOR: ROHINI






బ్రాండెడ్ స్వీట్ల బాగోతం

ఆల్మండ్ హౌస్ పాచి స్వీట్ల పాపం

- పైకి మెరుపు... లోపల మురికి
- హైదరాబాదులో 'స్వీట్' పాయిజన్
- 17 ప్రముఖ షాపులపై ఫుడ్ సేఫ్టీ దాడులు
- నిబంధనల ఉల్లంఘన... లైసెన్సులు రద్దు!
- విచ్చలవిడిగా కల్తీ ఉన్నట్లు గుర్తింపు



పండుగలు వచ్చాయంటే ఇళ్లన్నీ పిండివంటలు, రకరకాల మిఠాయిల ఘుమఘుమలతో కళకళలాడాలి. కానీ భాగ్యనగరంలో పేరుమోసిన స్వీట్ షాపుల కిచెన్లలోకి తొంగిచూస్తే మాత్రం వాంతులు వచ్చేంత దారుణ దృశ్యాలు కంటపడుతున్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న తీరు కలవరపెడుతోంది. - సహనం వందే, హైదరాబాద్



ఫుడ్ వింగ్, ఎన్ఫోర్స్‌మెంట్ విభాగాలకు చెందిన 12 ప్రత్యేక బృందాలు గ్రేటర్ పరిధిలోని 17 ప్రముఖ స్వీట్ షాపులను జల్లెడ పట్టాయి. తయారీ కేంద్రాల్లోకి అడుగుపెట్టిన అధికారులకే దిమ్మతిరిగే పరిస్థితులు కనిపించాయి. పైకి మాత్రం శుభ్రంగా కనిపించే ఈ షాపుల లోపల నరకప్రాయమైన వాతావరణం బయటపడింది.

గడువు తీరిన మిఠాయిలతో దందా

అమ్మడుపోని పాత స్వీట్లను, గడువు ముగిసిన పదార్థాలను మళ్లీ వేడి చేసి రంగులు, పంచదార పాకం జోడించి కొత్త స్వీట్లుగా మారుస్తున్నారు. కస్టమర్ల నెత్తిన వీటిని రుద్దుతూ ప్రజారోగ్యంతో వ్యాపారులు చెలగాటమాడుతున్నారు. ఈగలు ముసిరిన గదులు, మురికి నీరు నిలిచిన నేలలు, చేతులకు గ్లౌజులు గానీ, తలలకు క్యాపులు గానీ లేకుండా అత్యంత మురికిగా ఉన్న కార్మికులు మిఠాయిలను తయారుచేస్తూ కనిపించారు.

కఠిన చర్యలు... లైసెన్సులు రద్దు

నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు పెద్ద మొత్తంలో నిల్వ ఉంచిన గడువు ముగిసిన స్వీట్లు, కల్తీ పదార్థాలను స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. నిబంధనలను బేఖాతరు చేసినందుకు గాను 17 దుకాణాల లైసెన్సులను అధికారులు రద్దు చేశారు. శ్రీజ ఫుడ్స్, వాసిరెడ్డి స్వీట్స్, ప్రమోద స్వీట్స్, గోదావరి వంటిల్లు, బాలాజీ రతన్‌లాల్, రామదాస్ స్వీట్స్, స్వీట్ బాస్కెట్, స్వగృహ ఫుడ్స్, అభిరుచి ఫుడ్స్, రాజీవ్ రెడ్డి, శుభం ఫుడ్స్, మిఠాయి మియా, సుదర్శన్ రెడ్డి స్వీట్స్, హనీ ఫుడ్స్, ఆల్మండ్ హౌస్, మధుర స్వీట్స్, మెజిస్టిక్ స్వీట్స్ దుకాణాలు ఈ జాబితాలో ఉన్నాయి.

అధికారుల హెచ్చరికలు...

ప్రజల ప్రాణాలతో చెలగాట మాడితే ఎంతటి పెద్ద వ్యాపార సంస్థలైనా ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. ఆహార భద్రతా ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానాస్పదంగా ఉన్న పలు నమూనాలను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్ పరీక్షలకు పంపారు.

వినియోగదారుల అప్రమత్తత ముఖ్యం

వ్యాపారులు ఎంత పెద్దవారైనా, బ్రాండెడ్ షెల్ఫ్‌లలో విక్రయించినా తనిఖీలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వినియోగదారులు కూడా స్వీట్లు కొనుగోలు చేసే సమయంలో తయారీ తేదీ, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. లేదంటే పండుగ ఆనందం కాస్తా ఆసుపత్రి పాలయ్యేలా చేస్తుంది.

దేవుడి భూమిలో దయ్యాలు

రూ.100 కోట్ల దేవాదాయ భూమి ఆక్రమణ

- ప్రభుత్వ రికార్డుల్లో భారీ తేడాలు
- అధికారుల నిర్లక్ష్య ధోరణి
- కోర్టు స్టేల కొర్రీలు... వెలసిన విల్లాలు

అధికారుల నిర్లక్ష్యం, రికార్డుల లోపాల వల్ల రూ. 100 కోట్ల విలువైన దేవాదాయ శాఖ భూములు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్ళిపోతున్నాయి. సరిహద్దులు నిర్ధారించి కంచె వేయకపోవడంతో ఎకరా ఎకరా కరిగిపోతోంది. అసలు భూమి విస్తీర్ణంలోనే కొలతల తేడాలు రావడం, అధికారులు ముందడుగు వేయలేకపోవడం అక్రమార్కులకు వరంలా మారింది. - సహనం వందే, హైదరాబాద్



మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, మేడిపల్లి మండలం చెంగిచర్ల గ్రామంలో 'టిఎల్‌పి ఛారిటీస్' పేరిట దేవాదాయ శాఖకు సర్వే నంబర్లు 33/8, 33/9, 33/1లలో సుమారు 30ఎకరాల భూమి ఉంది. అయితే ఇందులో దాదాపు 7 నుండి 10 ఎకరాల వరకు ఆక్రమణకు గురైందని వెల్లడైంది. దీని మార్కెట్ విలువ ప్రస్తుతం సుమారు రూ. 100 కోట్లు ఉంటుందని అంచనా. దేవాదాయ శాఖ ఈ భూములకు హద్దులు నిర్ణయించి, ఫెన్సింగ్ వేయడంలో దారుణంగా విఫలమవడమే ఈ పరిస్థితికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

రికార్డుల మధ్య తేడాల విచిత్రం

ఈ ఆక్రమణల వెనుక రికార్డుల తేడా దాగి ఉంది. భూమి విస్తీర్ణం లెక్కల్లో రికార్డులు (పహాణీలు), ఊరి మ్యాప్‌లు సరిపోలడం లేదు. ఉదాహరణకు:

- **సర్వే నంబర్ 33/8: పహాణీ రికార్డుల ప్రకారం 15 ఎకరాలు ఉంటే, స్కాన్ చేసిన విలేజ్ మ్యాప్‌లో మాత్రం 22 ఎకరాలుగా ఉంది.**
- **సర్వే నంబర్ 33/9: పహాణీలో 16 ఎకరాలు ఉండగా, గ్రామం మ్యాప్‌లలో 18 ఎకరాలుగా నమోదు చేశారు.**
- **సర్వే నంబర్ 33/10: పహాణీలలో 13 ఎకరాలు ఉంటే, మ్యాప్‌లలో 15.15 ఎకరాలుగా చూపుతోంది.**

సర్వే నంబర్ 33లో అధికారికంగా ఎలాంటి సబ్-డివిజన్లు లేవు, కానీ ధృవీకరణ లేని మరో మ్యాప్‌లో 33/1 నుండి 33/12 వరకు విభజనలు కనిపించడం గమనార్హం.

ఇళ్లు, విల్లాలు.. లేఅవుట్‌ల మాయాజాలం

దేవాదాయ శాఖ భూమి చుట్టుపక్కల ఉండే కొందరు భూస్వాములు ఈ రికార్డుల గందరగోళాన్ని ఆసరాగా చేసుకున్నారు. ఇతర సర్వే నంబర్లను చూపుతూ దేవుడి భూమిని ఆక్రమించేశారని ఫిర్యాదులు వచ్చాయి. అంతటితో ఆగకుండా, కొన్నేళ్ల క్రితం లేఅవుట్ అనుమతులు తెచ్చుకుని అప్పటి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా విల్లా ప్రాజెక్టులను కూడా నిర్మించేశారని సమాచారం.గత రెండేళ్లలో ఈ వివాదాస్పద సర్వే నంబర్లలో ఏకంగా నివాస గృహాలు, నిర్మాణాలు వెలిశాయి.

అధికారులు ఏమంటున్నారు?

ఈ ఆక్రమణల ఆరోపణలను దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు అంగీకరించారు. సమగ్ర సర్వే నిర్వహించడంలో దేవాదాయ, రెవెన్యూ శాఖలు విఫలమయ్యాయని ఆయన తెలిపారు. 2024 సెప్టెంబర్ 13న దేవాదాయ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మేడిపల్లి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ అధికారులు కలిసి ప్రాథమిక సర్వే చేసి ఒక స్కెచ్ తయారు చేశారు. 1974-75 నాటి పహాణీలకు, ప్రస్తుత స్కాన్డ్ మ్యాప్‌లకు తేడాలున్నాయని ఆ నివేదిక స్పష్టం చేసింది.

కోర్టు స్టేలు.. శాఖల నిర్లక్ష్యం

కార్పొరేటర్లు, స్థానికులు మేడ్చల్-మల్కాజ్‌గిరి కలెక్టర్‌కు, దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు. భూముల పరిరక్షణ కోసం 2025 జూలైలో మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి ల్యాండ్ సర్వే విభాగానికి లేఖ రాశారు.కానీ,కోర్టు స్టే ఉత్తర్వులు ఉండటం వల్ల సర్వే ముందుకు సాగలేదని అధికారులు చెబుతున్నారు.అయితే, కోర్టు ఇచ్చే స్టేను తొలగించడానికి దేవాదాయ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, సర్వేను పూర్తి చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దేవుడి ఆస్తులకు రక్షణ ఏది?

కోట్ల విలువైన ప్రభుత్వ, దేవాదాయ భూములు అక్రమార్కుల పాలుపుతుంటే అధికారులు మాత్రం కోర్టు కేసులు, రికార్డుల సాకులు చూపుతూ కాలయాపన చేస్తున్నారు. పహాణీలు, మ్యాప్‌ల మధ్య ఉన్న వ్యత్యాసాలను సరిచేసి, కోర్టులోని వివాదాలను త్వరితగతిన పరిష్కరిస్తేనే ఈ రూ.100 కోట్ల భూమి దేవాదాయ శాఖకు దక్కుతుంది. లేదంటే అక్రమార్కుల చేతుల్లోకి వెళుతుంది.

ప్రభుత్వాలపై పాప్ సాంగ్స్ మోత

ఉర్రూతలూగిస్తున్న 'జంతర్ మంతర్ పే క్యా దేఖా?' పాట

- మ్యూజిక్, రాప్ రూపంలో ఆందోళనలు
- మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో సోషల్ మీడియాలో ట్రెండింగ్
- సోషల్ మీడియా వేదికగా నిరసన గళాలు ఉధృతం
- ఒక్క రాత్రిలో సంచలనం సృష్టిస్తున్న కళాకారులు

నాగ్‌పూర్‌కు చెందిన రాపర్ వినోద్ బాలకృష్ణ వాఘడే (అలియాస్ గరం కళాకార్) తన పాటతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేసిన నిరసనలు, ఆపై పోలీసుల లాఠీచార్జ్ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వేలాది కిలోమీటర్ల దూరంలో రాయ్‌పూర్‌లో ఉన్నప్పటికీ, అభిమానుల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు వినోద్ ఒక్క రాత్రిలో "జంతర్ మంతర్ పే క్యా దేఖా?" అనే పాటను రాశారు. మరుసటి రోజు సాయంత్రానికి అది ఆన్‌లైన్‌లో విడుదల కాగా, కేవలం రెండు రోజుల్లోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 41 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకుంది. - సహనం వందే, నాగ్‌పూర్



ప్రధాన ప్రసార మాధ్యమాలు చూపించని వాస్తవాలను, సామాన్యుల కష్టాలను సంగీతం ద్వారా బయటపెట్టడమే ఈ కొత్త తరం కళాకారుల ప్రత్యేకత. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, నిరుద్యోగం, పరీక్షల్లో అక్రమాలు వంటి అంశాలపై ఈ పాప్ పాటలు సూటిగా ప్రశ్నిస్తున్నాయి. కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా, సామాజిక చైతన్యం కోసం మ్యూజిక్‌ను ఎలా వాడొచ్చో జెన్-జీ నిరూపిస్తోంది. పాటల ద్వారా ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ రాబోయే రాజకీయ పరిణామాలపై కూడా ఈ గీతాలు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి.

సోషల్ మీడియా పవర్: గడప దాటిన గళాలు

ఒకప్పుడు నిరసనలు తెలియజేయాలంటే రోడ్లపైకి రావాల్సి వచ్చేది. కానీ నేడు డిజిటల్ యుగంలో ఒక స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ ఉంటే చాలు కోట్లాది మందికి గొంతు వినిపించవచ్చు. గరం కళాకార్ లాంటి కళాకారులు స్టూడియోల చుట్టూ తిరగకుండా, తక్కువ వనరులతోనే తమ పాటలను సోషల్ మీడియాలో విడుదల చేస్తున్నారు. ఈ ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, షార్ట్ వీడియోల ట్రెండ్ వల్ల ఈ నిరసన పాటలు మారుమూల గ్రామాల వరకు క్షణాల్లో చేరుతున్నాయి. దీనివల్ల నిరసనల్లో ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా, భావోద్వేగపరంగా లక్షలాది మంది యువత ఆందోళనలతో కనెక్ట్ అవుతున్నారు.

అధికారంతో నేరుగా ఢీ కొంటున్న 'ప్రొటెస్ట్ పాప్'

ఈ సరికొత్త ప్రొటెస్ట్ పాప్ కేవలం ఆవేదనను వ్యక్తపరచడమే కాకుండా, పాలకుల జవాబుదారీతనాన్ని నేరుగా నిలదీస్తోంది. సామాన్యుల నుంచి వస్తున్న ఈ తీవ్రమైన వ్యతిరేకతను రాజకీయ నాయకులు కూడా విస్మరించలేకపోతున్నారు. విద్యారంగంలో సంస్కరణలు లేదా మంత్రుల రాజీనామాలు వంటి పరిణామాలు జరిగినప్పుడు తమ పాటలే తమకు శ్రీరామరక్ష అని యువత భావిస్తోంది. భౌతికంగా అక్కడ లేకపోయినా, తమ భావజాలంతో ప్రతి ఒక్కరినీ ఏకం చేయడంలో ఈ పాటలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ప్రొటెస్ట్ పాప్...

కాలం మారుతున్న కొద్దీ నిరసన తెలిపే పద్ధతులు కూడా మారుతున్నాయి. లాఠీలు, బాష్పవాయు గోళాలకు భయపడకుండా యువత ఇప్పుడు తమ చేతిలోని పెన్ను, గొంతును ఆయుధంగా మలుచుకుంటోంది. ఈ 'ప్రొటెస్ట్ పాప్' ట్రెండ్ కేవలం సంగీతంలో వచ్చిన మార్పు మాత్రమే కాదు, రాబోయే తరాల రాజకీయ చైతన్యానికి అద్దం పడుతోంది. సామాన్యుడి గొంతును అణచివేయలేమనే సత్యాన్ని ఈ పాటలు మరోసారి నిరూపిస్తూ,పాలకులకు నిద్రలేకుండా చేస్తున్నాయి.